నమస్తే తెలంగాణ
# సంగారెడ్డి
I | హైదరాబాద్, సోమవారం 6 జనవరి 2025 | SANGAREDDY

## పార్టీ పటిష్టానికి కృషిచేయాలి

**మర్కూక్ బీఆర్ఎస్ నేతలకు కేటీఆర్ సూచన**



కేటీఆర్‌ను కలిసి మర్కూక్ మండలం బీఆర్ఎస్ నేతలు

మర్కూక్,జనవరి 5: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను ఆదివారం మర్కూక్ మండలానికి చెందిన బీఆర్ఎస్ బీసీ సెల్ అధ్యక్షుడు, సేవారత్నం అవార్డు గ్రహీత మ్యాకల కనకయ్య, నాయకులు రాజేశ్వర్‌రావు, అప్పాల భాస్కర్, పిట్టల రాజు, కృష్ణ కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. పార్టీ చేపట్టే కార్యక్రమాల్లో గ్రామస్థాయి నాయకుల నుంచి కార్యకర్తల వరకు అందరినీ కలుపుకొని కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడాలని కేటీఆర్ వారికి సూచించినట్లు నాయకులు తెలిపారు. పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాలుపంచుకోవాలని కేటీఆర్ సూచించినట్టు కనకయ్య తెలిపారు.



యువజన విభాగం కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న హరీశ్‌రావు

## కక్షగట్టిన కాంగ్రెస్

- అభివృద్ధిని అడ్డుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం
- ఏడాది కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం అధోగతి
- పాత పథకాలు బంద్.. అటకెక్కిన ఆరు గ్యారంటీలు
- కాంగ్రెస్ ప్రభుత్వ తీరును యువత ఎండగట్టాలి
- నంగునూరు మండల యువజన విభాగం కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే హరీశ్‌రావు



సమావేశానికి హాజరైన నంగునూరు మండల బీఆర్ఎస్ యువజన విభాగం నాయకులు

సిద్దిపేట, జనవరి 5: కాంగ్రెస్ ప్రభుత్వం కక్ష పూరితంగా వ్యవహరిస్తూ సిద్దిపేట అభివృద్ధిని అడ్డుకుంటున్నదని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. ఆదివారం సిద్దిపేట పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నంగునూరు మండల యువజన విభాగం నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో సిద్దిపేటలో పరుగులు పెట్టిన అభివృద్ధి కాంగ్రెస్ ఏడాది పాలనలో ఆగిపోయిందన్నారు. మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సిద్దిపేట అభివృద్ధిపై అక్కసు వెళ్లగక్కుతూ,ఇక్కడి ప్రజలపై కక్ష సాధిస్తున్నదన్నారు.సిద్దిపేట అంటే గౌరవం వచ్చేలా అభివృద్ధి చేసి రాష్ట్రానికి ఆదర్శంగా నిలిపామన్నారు.నాడు కేసీఆర్ ప్రభుత్వంలో మంజూరైన పనులను కాంగ్రెస్ సర్కారు రద్దు చేసిందని, అనేక పనులను మధ్యలో ఆపి సిద్దిపేట అభివృద్ధిని అడ్డుకుంటున్నట్లు హరీశ్‌రావు పేర్కొన్నారు. రంగనాయక సాగర్ టూరిజం డెవలప్‌మెంట్, దవాఖాన, శిల్పారామం వంటి నిర్మాణ పనులు ఆపివేసినట్లు గుర్తుచేశారు. కొత్తవి మంజూరు చేయకపోగా, పాత పనులన్నింటినీ ఆపడం ఎంతవరకు సమంజసం అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఇదేనా కాంగ్రెస్ ఏడాది అభివృద్ధి పాలన అని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్‌కు ప్రజా ప్రయోజనాలు పట్టవా అని ప్రశ్నించారు. ఏడాదిగా కాంగ్రెస్ పాలనలో సిద్దిపేటకు చేసిన ఒక్క మంచి పని ఏమిటో చెప్పాలని కాంగ్రెస్ నాయకులను హరీశ్‌రావు ప్రశ్నించారు. సిద్దిపేటలోని వెటర్నరీ కళాశాలను కొడంగల్‌కు తరలించుకుపోతే కాంగ్రెస్ నాయకులు నోరు మెదపడం లేదన్నారు. సిద్దిపేట అభివృద్ధి పనులు జరిగే వరకు పోరాటం చేస్తామన్నారు. అభివృద్ధి పనులు ప్రారంభమయ్యే వరకు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని వదిలిపెట్టనని హరీశ్‌రావు పేర్కొన్నారు.

**రాజకీయాల్లో యువతదే కీలక భూమిక**

భవిష్యత్తు అంతా యువతదేనని, కాంగ్రెస్ ప్రభుత్వం చేసున్న అన్యాయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సి బాధ్యత యువతపై ఉందని హరీశ్‌రావు అన్నారు. కాంగ్రెస్ నాయకులు సొంత ప్రయోజనాలను మాని ప్రజా సంక్షేమం, అభివృద్ధిపై దృష్టి సారించాలని హితవు పలికారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో నంగునూరు మండలం ఎంతో అభివృద్ధి చెందిందని, నాలుగు వరుసల రహదారులు, విద్య, వైద్యం, అన్నిరంగాల్లో అభివృద్ధి సాధించుకున్నట్లు తెలిపారు. నేడు కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేస్తున్నదని, దీనిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని యువతకు సూచించారు. యువత రాజకీయాల్లో క్రియాశీలక పాత్ర పోషించి, కీలకంగా వ్యవహరించాలన్నారు. రాబోయే రోజుల్లో యువతకు సముచిత స్థానం ఇస్తామని,పార్టీలో క్రియాశీలకంగా పనిచేయాలన్నారు. కాంగ్రెస్ పాలనలో ఎగవేతలు, కోతలు తప్ప పురోగతి ఏమి లేదని ఎద్దేవా చేశారు. ఆరు గ్యారంటీలు దేవుడెరుగు, పాత పథకాలను బంద్ చేశారని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు గుండు భూపేశ్, బీఆర్ఎస్ నియోజకవర్గ యువజన విభాగ అధ్యక్షుడు నిమ్మ రజినీకాంత్ రెడ్డి, యువజన విభాగం నాయకులు పాల్గొన్నారు.



పద్మశాలీ సంఘం సిద్దిపేట జిల్లా క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి,హరీశ్‌రావు



సంగారెడ్డి జిల్లా కాశీపూర్‌లో డ్రైనేజీ దుస్థితి



సిద్దిపేటలో అర్బన్ మండలం ఎన్సాన్‌పల్లి శివారులో చెత్త



సంగారెడ్డి జిల్లా చేర్యాలలో డ్రైనేజీలో పేరుకుపోయిన చెత్త

# సమస్యల వలయంలో పల్లెలు

- పడకేసిన పారిశుధ్యం
- పత్తాలేని ప్రత్యేకాధికారులు
- పల్లె భారం అంతా పంచాయతీ కార్యదర్శులపైనే
- ఏడాదిగా నెట్టుకొస్తున్న కార్యదర్శులు
- గ్రామాలకు నిధులు విడుదల చేయని కాంగ్రెస్ ప్రభుత్వం
- జీతాలు ఇవ్వలేని పరిస్థితిలో జీపీలు.. ఖాతాల్లో డబ్బులు నిల్
- పారిశుధ్య కార్మికులు జీతాలు లేవు
- పల్లెల్లో చిన్నచిన్న సమస్యలు పరిష్కరించలేని పరిస్థితి
- కాంగ్రెస్ పాలనలో దుస్థితిలో పల్లెసీమలు..ఇబ్బందుల్లో జనం



సంగారెడ్డి జిల్లా చేర్యాలలో గ్రామంలో పేరుకుపోయిన చెత్త

సిద్దిపేట, జనవరి 5(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : కాంగ్రెస్ ప్రభుత్వంలో పల్లెసీమలు నిరాదరణకు గురవుతున్నాయి. స్థానిక సంస్థల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఎక్కడి సమస్యలు అక్కడనే ఉన్నాయి. ఏడాది కాలంగా గ్రామాలకు నిధులు లేవు. ప్రజాప్రతినిధులు లేరు.ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతోంది. గ్రామాల్లో చిన్న చిన్న పనులు చేయడానికి పంచాయతీ కార్యదర్శులు అప్పులు తెచ్చి చేస్తున్నారు. ఇక గ్రామాల భారం మోయలేమని పంచాయతీ కార్యదర్శులు మొత్తుకుంటున్నారు. గ్రామాలకు నియమించిన ప్రత్యేకాధికారులు కానరావడం లేదు. ముందు నుయ్యి వెనుక గొయ్యి అన్న చందంగా పంచాయతీ కార్యదర్శులు పరిస్థితి తయారైంది. గ్రామాలను పట్టించుకునే వారు కరువయ్యారు. బీఆర్ఎస్ హయాంలో పరిపాలనా సౌలభ్యం కోసం రెవెన్యూ, స్థానిక సంస్థల వ్యవహారాల పర్యవేక్షణకు వేర్వేరుగా అదనపు కలెక్టర్లను నియమించింది. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వంలో వారి పర్యవేక్షణ అంతంత మాత్రంగానే మారింది. పాత మెదక్ జిల్లాలో 1,615 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. కొత్తగా ఏర్పడిన సిద్దిపేట జిల్లాలో 499 జీపీలు, మెదక్ జిల్లాలో 469 జీపీలు, సంగారెడ్డి జిల్లాలో 647 జీపీలు ఉన్నాయి. అన్ని పంచాయతీలు ప్రస్తుతం నిధులలేమితో కొట్టుమిట్టాడుతున్నాయి.

**జాడలేని ప్రత్యేకాధికారులు**

సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో గ్రామాల పరిస్థితి అస్తవ్యస్తంగా తయారైంది. జిల్లా, మండల, గ్రామాల పాలక వర్గాల గడువు పూర్తయి ఏడాది కావస్తున్నది. గ్రామ పంచాయతీల పాలకవర్గం గడువు గత ఫిబ్రవరిలో ముగిసింది. గడువు ముగియగానే గ్రామాలకు ప్రత్యేకాధికారులను ప్రభుత్వం నియమించింది. వీరిని నియమించినా భారమంతా పంచాయతీ కార్యదర్శుల మీదనే పడుతున్నది.గ్రామాలకు నియమించిన ప్రత్యేకాధికారుల పర్యవేక్షణ కరువైంది. కనీసం వారికి కేటాయించిన గ్రామాలకు రావడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. పర్యవేక్షణ లేక గ్రామాల్లో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. తాము గ్రామాలకు ప్రత్యేకాధికారులం అని చెప్పి అటు గ్రామాలకు వెళ్లడం లేదు. ఇటు వారి సొంత శాఖలో డ్యూటీలు నిర్వహించడం లేదు. పూర్తిగా ఉద్యోగ బాధ్యతలను వదిలి సొంత వ్యాపారాల వైపు మొగ్గు చూపుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. నెలనెలా ప్రభుత్వ వేతనం తీసుకుంటూ తమ ఉద్యోగ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తలేరనే ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. కాలక్షేపం, సొంత వ్యాపారాలకే ప్రభుత్వ ఉద్యోగులు పరిమితం అవుతున్నారన్న విమర్శలు ఉమ్మడి మెదక్ జిల్లావ్యాప్తంగా బలంగా వినిపిస్తున్నాయి. ఆఫీసు సమయంలో సైతం చాలామంది అధికారులు కార్యాలయాల్లో ఉండడం లేదని తెలిసింది. తీసుకునేది ప్రభుత్వ జీతం...చేసేది ప్రైవేట్ వ్యాపారాలు ఇది ఉమ్మడి జిల్లాలోని కొన్ని ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగుల తీరు ఉంది. గ్రామాలకు నియమించిన ప్రత్యేకాధికారులు రాకపోవడంతో ఆ భారమంతా పంచాయతీ కార్యదర్శులు మీదనే పడుతున్నది.

**నిధులు లేక కొట్టుమిట్టాడుతున్న పల్లెలు**

రాష్ట్ర ప్రభుత్వం నిధులను విడుదల చేయకపోవడంతో ఉమ్మడి మెదక్ జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలు నిధుల లేమితో కొట్టుమిట్టాడుతున్నాయి. జీపీ బ్యాంకు ఖాతాలు ఖాళీగా ఉన్నాయి. ప్రధానంగా గ్రామాలకు మూడు రకాల ఖాతాలు ఉంటాయి. వీటిలో ఒకటి ఆస్తి పన్ను జమ చేసుకునే ఖాతా.. గ్రామ పంచాయతీల్లో ఆస్తి పన్ను వసూలు చేసి ఆ ఖాతాలో జమ చేస్తారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఆస్తి పన్ను అంతంత మాత్రంగానే వసూలు అవుతున్నాయి. గ్రామాల ఖర్చులు విపరీతంగా పెరిగిపోయాయి. ఇక రెండో ఖాతా ఎస్ఎఫ్‌సీ ఉంటుంది. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ప్రత్యేక నిధులను జమచేస్తారు. కొన్ని నెలలుగా రూపాయి కూడా ఈ ప్రభుత్వం విడుదల చేయక పోవడంతో ఈ ఖాతా పూర్తిగా ఖాళీగానే ఉంది. మూడో ఖాతా ఆర్థిక సంఘం సంబంధించినది. దీనిలో కేంద్ర ప్రభుత్వం నేరుగా గ్రామ పంచాయతీలకు నిధులను జమ చేస్తుంది. గ్రామాల్లో ఉండే జనాభా ప్రతిపాదికన ఈ నిధులను జమ చేస్తారు. ప్రతి మూడు లేదా నాలుగు నెలలకు ఒక్కసారి నిధులు జమఅవుతాయి. వీటిని గ్రామాల్లో ప్రత్యేక పనులకు ఖర్చు చేసుకుంటారు. కేసీఆర్ ప్రభుత్వంలో ప్రతినెలా పల్లెప్రగతి కింద నిధులను విడుదల చేసింది.ఉమ్మడి మెదక్ జిల్లాలోని అన్ని గ్రామాలు పల్లెప్రగతి ద్వారా అద్భుత ప్రగతిని సాధించాయి. జిల్లాలోని అన్ని గ్రామాలు పురోగతి దశలో పయనించాయి. బీఆర్ఎస్ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ అమలు చేసి అభివృద్ధి పథంలో నడిపించింది. పల్లె ప్రగతిలో ఎన్నో కార్యక్రమాలను చేపట్టింది. ప్రతి నెలా ఉమ్మడి మెదక్ జిల్లాకు రూ.30 కోట్ల పైచిలుకు నిధులు వచ్చాయి. ఇవి గాకుండా గ్రామాల్లో పన్నుల ద్వారా ఇతరత్రా ఆదాయం వచ్చేది. ఈ నిధులతో గ్రామాలను అద్భుతంగా తీర్చిదిద్దారు. పల్లె ప్రగతి కింద విస్తృతంగా పారిశుధ్య కార్యక్రమాలను చేపట్టారు.ఫలితంగా గ్రామాలు శుభ్రంగా ఉండేవి.ఆరోగ్య గ్రామాలుగా ఫరిఢవిల్లాయి.కేసీఆర్ ప్రభుత్వం ప్రతి గ్రామానికి జనాభా లెక్కల ప్రకారం అభివృద్ధి నిధులను ప్రతినెలా కేటాయించింది. ప్రతి ఊరికి డంపింగ్ యార్డు, హరిత హారంలో విరివిగా మొక్కలు నాటించింది. ప్రతి గ్రామ పంచాయతీకి ట్రాక్టర్‌ను కొనిచ్చింది. తాగునీటి సమస్య లేకుండా ప్రతి ఇంటికీ నల్లా ద్వారా నీటిని అందించారు. పల్లెల సమగ్రాభివృద్ధికి ఇతోధికంగా కృషిచేయడంతో జాతీయ, రాష్ట్ర స్థాయిలో జిల్లాలోని అనేక గ్రామాలు అవార్డులు సాధించాయి. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం నిధులను విడుదల చేయకపోవడంతో గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి కుంటుబడింది. సమస్యలతో ప్రజలు సతమతమవుతున్నారు. గ్రామ స్వరాజ్య లక్ష్యం దెబ్బతింటున్నది.

**ఎక్కడిచెత్త అక్కడే...**



సంగారెడ్డి జిల్లా మునిపల్లిలో డ్రైనేజీ దుస్థితి


సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి జిల్లాల్లోని ఏ గ్రామం చూసినా పారిశుధ్యం పడకేసింది. ఇదివరకు చేసిన బిల్లులు రాకపోవడంతో పాటు కొత్త పనులు పూర్తిగా లేవు. దీంతో గ్రామాల్లో ఎక్కడవేసిన గొంగళి అన్నట్లుగా తయారైంది. గ్రామాల్లో చిన్న చిన్న పనులు సైతం జరగడం లేదు. ప్రధానంగా గ్రామాల్లో విద్యుత్ దీపాలు, తాగునీటి సమస్యలు, పారిశుధ్య పనులు చేపట్టడానికి చిల్లి గవ్వ లేకపోవడంతో గ్రామాల్లో సమస్యలు పేరుకుపోతున్నాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పరిశ్రమలు ఉన్న గ్రామాల్లో కొంత ఆదాయం గ్రామాలకు వచ్చినా వాటిని వినియోగించకుండా ప్రభుత్వం ఫ్రీజ్ చేసింది. దీంతో ఏం చేయాలో అర్థం కాని పరిస్థితుల్లో అధికారులు ఉన్నారు. ఆదాయ వనరులున్న పంచాయతీల్లోనే జీతాలు చెల్లించలేని పరిస్థితి ఉంటే, ఆదాయం లేని గ్రామాల పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. గ్రామాల్లో పని చేసే పారిశుధ్య కార్మికులకు నెలల తరబడి జీతాలు రావడం లేదు. నెలనెలా జీతాలు ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ సర్కార్ హామీని విస్మరించిందని పారిశుధ్య కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లో పారిశుధ్య బాగుండాలంటే వారికి సక్రమంగా జీతాలు ఇవ్వాలి కదా ..అలా ఇస్తేనే వారు పనులు సరిగ్గా చేస్తారు. నెలల తరబడి జీతాలు లేక పోతే వారు ఎలా పనిచేస్తారు. వారి కుటుంబాలను ఎలా పోషించుకుంటారు ..? ఒక్కసారి ప్రభుత్వం ఆలోచన చేయాలి. గ్రామాల్లో ఎక్కడికక్కడ చెత్త కుప్పలు కనిపిస్తున్నాయి. డ్రైనేజీల్లో చెత్త పేరుకుపోయింది. హరితహారం కింద నాటిన మొక్కలను పట్టించుకునే వారు కరువయ్యారు. డంపుయార్డులు నిరుపయోగంగా మారాయి. చెత్త నిర్వహణ, సేకరణ సరిగ్గా జరగడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు.



కొండపాక మండలం మర్పడగ గ్రామంలో చెత్తకుప్ప

## మరోసారి మోసగిస్తున్న కాంగ్రెస్

- సాగుభూముల నిబంధనను విరమించుకోవాలి
- జాబ్‌కార్డు ఉన్న వారందరికీ రూ.12 వేలు వర్తింపజేయాలి
- ఎంపీ సురేశ్ శెట్కార్, ఎమ్మెల్యే సంజీవ్‌రెడ్డి స్పందించాలి
- నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి డిమాండ్



నారాయణఖేడ్‌లో విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్, జనవరి 5: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఎకరాకు ఏడాదికి రూ.15 వేల రైతు భరోసా ఇస్తామని ఇచ్చిన హామీని పక్కన పెట్టి రూ.12 వేలు ఇస్తామని ప్రకటించి రైతులను మరోసారి మోసం చేసిందని నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి విమర్శించారు. ఆదివారం నారాయణఖేడ్‌లోని తన నివాసంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారం చేపట్టిన తర్వాత కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చిన రైతుబంధును అమలు చేయకుండా తాత్సారం చేస్తున్నదన్నారు. రైతు భరోసా పథకంపై అధ్యయనం చేసేందుకు కమిటీ పేరిట కాలయాపన చేసిన ప్రభుత్వం, త్వరలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని రైతుభరోసాపై అనాలోచితంగా ప్రకటన చేసిందన్నారు.

**నారాయణఖేడ్ రైతులకు నష్టం...**

సాగుచేసిన భూములకు మాత్రమే రైతు భరోసా ఇస్తామన్న నిబంధనలతో వర్షాధార పంటలను పండించే నారాయణఖేడ్ వంటి ప్రాంతాల్లోని రైతులు నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. కేసీఆర్ హయాంలో రైతుబంధు పథకం అమలు చేసే విషయంలో ఇదే ప్రస్తావన వచ్చినప్పుడు తాను నారాయణఖేడ్ పరిస్థితిని అప్పటి సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకుపోవడంతో ఆ నిబంధనను మినహాయించినట్లు గుర్తుచేశారు. ఈ ప్రాంత రైతులపై చిత్తశుద్ధి ఉంటే జహీరాబాద్ ఎంపీ సురేశ్ శెట్కార్, ఎమ్మెల్యే సంజీవ్‌రెడ్డి సీఎంతో చర్చించి సాగు భూముల నిబంధన లేకుండా చేయాలన్నారు. భూమిలేని రైతు కూలీలకు మాత్రమే రూ.12 వేలు ఇస్తామంటున్న ప్రభుత్వం తీరు సరికాదన్నారు. ఈ లెక్కన గుంటల్లో భూములు ఉన్న వారు నష్టపోతారని, జాబ్‌కార్డు ఉండి ఉపాధిహామీ పనులకు వెళ్లే కూలీలందరికీ రూ.12 వేలను వర్తింపజేయాలని సూచించారు. ఇక్కడి రైతులు బాగుపడాలనే ఆలోచన ప్రభుత్వానికి ఉంటే వెంటనే కేసీఆర్ ప్రభుత్వం మంజూరు చేసిన బసవేశ్వర ఎత్తిపోతల పథకంతో పాటు ఎనిమిది చెరువుల నిర్మాణ పనులు కొనసాగించాలన్నారు. రుణమాఫీ, పంటలకు బోనస్ విషయంలోనూ ప్రభుత్వం రైతులను మోసం చేసిందనే విమర్శించారు. వ్యవసాయ బోరుబావులకు విద్యుత్ కనెక్షన్ విషయంలోనూ కేసీఆర్ ప్రభుత్వం చూపిన ఉదారతను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం చూపడం లేదని, బీఆర్ఎస్ పార్టీ రైతులకు అండగా ఉండి కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేసే వరకు ప్రభుత్వాన్ని వెంటాడుతూనే ఉంటామని మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి స్పష్టం చేశారు.

## హుస్నాబాద్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతా

**రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్**

హుస్నాబాద్, జనవరి 5: హుస్నాబాద్ పట్టణాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఆదివారం హుస్నాబాద్‌లోని ఎల్లమ్మ చెరువు సుందరీకరణ పనులతో పాటు పలు వార్డుల్లో సీసీరోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి, పలు కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి శంకుస్థాపనలు, రైతు బజార్, నూతన గోదాంలకు ఆయన ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులను బట్టి ఎకరానికి రూ.12వేల రైతుభరోసా, వ్యవసాయ భూమిలేని రైతుకూలీలకు ఏటా రూ.12వేలు ఇచ్చేందుకు మంత్రివర్గం నిర్ణయించిందన్నారు. విధివిధానాలను త్వరలోనే ప్రకటిస్తామని చెప్పారు. జనవరి 26నుంచి కొత్త రేషన్‌కార్డుల పంపిణీ ఉంటుందన్నారు. హుస్నాబాద్‌లో అవసరమైన అభివృద్ధి పనులను ఇప్పటికే ప్రారంభించామని తెలిపారు. ఇంకా ఏంకావాలో పట్టణ ప్రముఖులు, మేధావులు సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు. ఎల్లమ్మ చెరువును ప్రముఖ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. గౌరవెల్లి రిజర్వాయర్ నుంచి ఎల్లమ్మ చెరువుకు లింక్ కెనాల్ ఏర్పాటు చేయడం ద్వారా నిరంతరం ఇందులో నీళ్లుండేలా పనులు చేపటనున్నట్లు మంత్రి తెలిపారు.

**మైనార్టీ బాలికల గురుకుల పాఠశాల సందర్శన...**

హుస్నాబాద్‌లోని తెలంగాణ మైనార్టీ బాలికల రెసిడెన్షియల్ స్కూల్‌ను ఆదివారం మంత్రి పొన్నం ప్రభాకర్ సందర్శించారు. గురుకులంలోని విద్యార్థినులు, ఉపాధ్యాయులతో మాట్లాడి కొత్త మెనూ అమలు, ఇతర సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఉన్నత లక్ష్యాలు ఎంచుకొని అందులో రాణించాలని, ముఖ్యంగా సైన్స్, ఇన్నోవేషన్‌లో ప్రతిభను కనబర్చాలని విద్యార్థులకు సూచించారు. గురుకులాన్ని డిగ్రీవరకు అప్‌గ్రేడ్ చేయాలని విద్యార్థులు కోరగా, అందుకు సంబంధించిన రాష్ట్ర స్థాయి అధికారితో మాట్లాడారు. అనంతరం పట్టణంలోని ప్రీమెట్రిక్ హాస్టల్‌ను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. అంతకుముందు 1989–90ఎస్ఎస్‌సీ బ్యాచ్ వారు అందించిన ఫ్రీజర్ శవపేటికను మున్సిపల్‌కు అందజేశారు. యాదవ కమ్యూనిటీ హాల్ శంకుస్థాపన అనంతరం గొర్రెపిల్లను ఎత్తుకొని డోలు వాయించారు.కార్యక్రమాల్లో సిద్దిపేట అడిషనల్ కలెక్టర్ అబ్దుల్ హమీద్, మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకట్, వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనితారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, ఆర్డీవో రామ్మూర్తి, సింగిల్‌విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, తహసీల్దార్ రవీందర్‌రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.



హుస్నాబాద్‌లోని మైనార్టీ గురుకులంలో విద్యార్థులతో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

## జర్నలిస్టుల హక్కులకు పోరాడుతాం

**- రాష్ట్ర మీడియా అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ**



జ్యోతిప్రజ్వలన చేస్తున్న అల్లంనారాయణ

గజ్వేల్, జనవరి 5: జర్నలిస్టుల హక్కుల సాధనకు పోరాడుతామని, అక్రిడిటేషన్లు తగ్గిస్తే ఊరుకునేది లేదని రాష్ట్ర మీడియా అకాడమీ మాజీ చైర్మన్, తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టు యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు అల్లం నారాయణ అన్నారు. ఆదివారం గజ్వేల్ పట్టణంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాల్‌లో టీయూడబ్ల్యూజే(హెచ్–143) సభ్యత్వ నమోదు కార్యక్రమానికి హాజరై ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో జర్నలిస్టుల ఆరోగ్యం కోసం రూ.35కోట్లు నిధులు కేటాయించినట్లు తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో కోటి రూపాయలు ఉన్న బడ్జెట్‌ను రూ.100కోట్లకు తీసుకెళ్లిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదే అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పదివేల మంది జర్నలిస్టులకు శిక్షణ శిబిరాల ద్వారా వృత్తి నైపుణ్యాలను పెంచినట్లు గుర్తుచేశారు. కరోనా కష్టకాలంలో 450మంది జర్నలిస్టులకు రూ.20వేల చొప్పున వైద్య ఖర్చుల నిమిత్తం ఇచ్చినట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 12 వేలు ఉన్న అక్రిడిటేషన్ కార్డులను 20వేలకు పెంచామన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా డెస్క్ జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు ఇచ్చిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కిందని అల్లం నారాయణ పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుతిసాగర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం గజ్వేల్ డివిజన్ కార్యావర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నవీన్, ప్రధాన కార్యదర్శిగా మహిపాల్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా బలరాం, కోశాధికారిగా రమేశ్, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడిగా మీర్జా అహ్మద్‌బేగ్‌లను ఎన్నుకున్నారు.

## నత్తనడకన ఇందిరమ్మ ఇండ్ల సర్వే

- ఇందిరమ్మ ఇండ్ల సర్వే జరుగుతున్న తీరుపై ప్రభుత్వం అసంతృప్తి
- సంగారెడ్డి జిల్లాలో 70శాతం మాత్రమే పూర్తి
- గడువులో వందశాతం సర్వే పూర్తి కష్టమే
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న దరఖాస్తుదారులు
- యాప్‌లో పదేపదే సాంకేతిక సమస్యలతో సర్వే సిబ్బంది తిప్పలు



కుల్పగూరులో పంచాయతీ సెక్రటరీ లేకుండా సర్వే చేపడుతున్న ఎస్‌హెచ్‌జీ సభ్యులు

సంగారెడ్డి, జనవరి 5(నమస్తే తెలంగాణ) : ఇందిరమ్మ ఇండ్ల సర్వే జరుగుతున్న తీరుపై అటు రాష్ట్ర ప్రభుత్వం, ఇటు దరఖాస్తుదారుల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతున్నది. రాష్ట్ర ప్రభుత్వం డిసెంబర్ 31 వరకు ఇందిరమ్మ ఇండ్ల సర్వే పూర్తి చేయాలని అధికార యంత్రాంగాన్ని ఆదేశించింది. కానీ, సంగారెడ్డి జిల్లాలో ఇప్పటి వరకు 70శాతం సర్వే మాత్రమే పూర్తయ్యింది. మరో 30శాతం వరకు సర్వే జరగాల్సి ఉంది. ఇది పూర్తిచేయడానికి మరో పది రోజులకుపైగా సమయం పట్టే అవకాశాలు ఉన్నాయి. జిల్లాలో సర్వే నత్తనడకన జరగడంపై ఉన్నతాధికారులు అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిసింది. సర్వే నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది గ్రామాల్లో ముందస్తు సమాచారం ఇవ్వక పోవడంతో దరఖాస్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం యాసంగి పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఎక్కువశాతం మంది వ్యవసాయ పనుల్లో నిమగ్నమై ఉన్నారు. ఈ సమయంలో సర్వే సిబ్బంది గ్రామాల్లో పర్యటిస్తున్నారు. దీంతో ఎక్కువ మంది సర్వేకు హాజరుకాలేకపోతున్నారు.సర్వే నిర్వహిస్తున్న సమయంలో దరఖాస్తుదారు లేకపోతే సర్వే సిబ్బంది వారికోసం వేచి చూడకుండా వెళ్లిపోతున్నారు. దీంతో దరఖాస్తుదారులు తమ వివరాలను నమోదు చేయించుకోలేక పోతున్నారు. నారాయణఖేడ్, అందోలు నియోజకవర్గాల నుంచి ఉపాధి కోసం చాలామంది హైదరాబాద్‌తో పాటు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లారు. వలస వెళ్లిన వారి దరఖాస్తులను సర్వే సిబ్బంది పరిశీలించడం లేదు. అధికార పార్టీ నేతలు సూచించిన దరఖాస్తుదారులకు సంబంధించి వివరాల సేకరణకు సర్వే సిబ్బంది ప్రాధాన్యత ఇస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇందిరమ్మ కమిటీల్లో సైతం అధికార పార్టీ నేతలకు ప్రాధాన్యం ఇవ్వడంతో ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపు నిష్పక్షపాతంగా జరుగుతుందా లేదా అన్న సందేహాలు దరఖాస్తుదారుల్లో వ్యక్తమవుతున్నాయి. ఇందిరమ్మ ఇండ్ల సర్వే యాప్‌లో పదేపదే సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయి. ప్రభుత్వ అధికారులు, సిబ్బంది సర్వే చేయడంలో శ్రద్ధ చూపడంలేదన్న విమర్శలు ఉన్నాయి. దీంతో గడువులోగా సర్వే పూర్తికావడం గగనంగా మారింది.

**వందశాతం సర్వే పూర్తి కష్టమే**

కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద ఇంటి స్థలం ఉన్న పేదలకు రూ.5 లక్షలు అందజేస్తామని ప్రకటించింది. ఈ పథకం కోసం ప్రజాపాలనలో దరఖాస్తులు స్వీకరించింది. సంగారెడ్డి జిల్లాలో 3,18,775 మంది దరఖాస్తు చేసుకున్నారు. అందోలు నియోజకవర్గంలో 344,369, నారాయణఖేడ్‌లో 66,451, పటాన్‌చెరులో 49,838, సంగారెడ్డిలో 58,553, జహీరాబాద్‌లో 75,835 మంది ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. హత్నూర మండలంలో 12,729 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక కోసం ప్రభుత్వం డిసెంబర్ 10వ తేదీ నుంచి 31వ తేదీ వరకు సర్వేకు ఆదేశించింది. ఆ మేరకు జిల్లాలో సర్వే చేపడుతున్నారు. ఇప్పటి వరకు 70 శాతం సర్వే పూర్తిచేశారు. మొత్తం 3,18,775 దరఖాస్తులకు అధికారులు 2,20,751 దరఖాస్తుదారుల ఇండ్లకు వెళ్లి సర్వే పూర్తి చేశారు. అందోల్ నియోజకవర్గంలో 37,456, నారాయణఖేడ్‌లో 42,542, పటాన్‌చెరులో 38,167, సంగారెడ్డిలో 43,031, నారాయణఖేడ్‌లో 75,835, హత్నూర మండలంలో 9552 దరఖాస్తుల సర్వే పూర్తయ్యింది. పూర్తి చేసిన సర్వేలో 2,11,336 దరఖాస్తులను ఆన్‌లైన్‌లో సబ్‌మిట్ చేశారు.